నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 19 ఏప్రిల్ 2025 | BHADRADRI KOTHAGUDEM

# రైతులు బాగుపడ్డది కేసీఆర్ పాలనలోనే..

**రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు**

పాల్వంచ, ఏప్రిల్ 18: రైతులు బాగుపడింది కేసీఆర్ పదేళ్ల పాలనలోనేనని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేసిందని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం పాత పాల్వంచలోని తన స్వగృహంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, అడగకున్నా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఆయన పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ రావాలని కోరుకుంటున్నారని అన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను విస్మరించిందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో విజయవంతంగా కొనసాగిన పథకాలను పక్కకు పెట్టడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో రుణమాఫీ కాక రైతులు అల్లాడుతున్నారని, రైతు భరోసా అందక, పంట రుణాలు దొరకక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు దండుకట్టి తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజుగౌడ్, కాంపెల్లి కనకేష్, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరాంమూర్తి, కొత్వాల సత్యనారాయణ, డిష్ నాయుడు, కనగాల బాలకృష్ణ, మడివి సరస్వతి, దాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

# పనిస్తున్నరు.. పైసలివ్వట్లే..

షేక్ గాలిబ్బి కడు పేదరాలు. ఈమెది చండ్రుగొండ మండలం మహ్మద్‌నగర్ గ్రామం. భర్తతో కలిసి కూలి పనులకు వెళ్తేనే పూటగడుస్తుంది. పిల్లలు వేరే ఉంటున్నారు. వ్యవసాయ కూలి పనులు చేయలేక ఉపాధి పనులకు వెళ్తున్నది. పని అయితే చేస్తున్నది కానీ.. రెండు నెలలుగా ఇంతవరకు కూలి సొమ్ములు రాలేదు. దీంతో పనిచేస్తూ కూడా పస్తులుండాల్సిన పరిస్థితి ఆ కుటుంబానిది. అసలే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు మండిపోతున్నాయి. చేతిలో పైసలు లేక పచ్చడి మెతుకులు తిని బతుకుతున్నారు. పూట గడవడం కష్టంగా ఉందని గాలిబ్బి ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఇది ఈమె ఒక్క కుటుంబానిదే కాదు.. జిల్లాలో చాలామంది కుటుంబాల పరిస్థితి ఇలానే ఉంది. ఉపాధి పనికి వెళ్తున్నప్పటికీ ఎన్నో కుటుంబాలు కరువులో కొట్టుమిట్టాడుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం లక్ష్యం నీరుగారిపోతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోవడం లేదు.

– భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ)


చండ్రుగొండ: తిప్పనపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- రెండు నెలలుగా అందని కూలి డబ్బులు
- పస్తులుంటున్న ఉపాధిహామీ కూలీలు
- ఎండల్లో పనిచేసినా కనికరం చూపని ప్రభుత్వం
- పని ప్రదేశంలో కనీస వసతులూ కరువు..
- వేసవిలో కరువు పనులకు బోనస్ రానట్టే?
- నీరుగారుతున్న 'ఉపాధిహామీ' పథకం లక్ష్యం


చండ్రుగొండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

పేదలకు కూలి పనులు లేని సమయంలో పనులు కల్పించి ఉపాధి కల్పించడమే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రధాన ఉద్దేశం. కానీ.. ఇక్కడ అలాంటిదేమీ జరగడం లేదు. పనులు చేయించుకుంటున్నారు.. కానీ.. కూలి సొమ్ములు మాత్రం ఇవ్వడంలేదు. దీంతో ఉపాధిహామీ పనులపై కూలీలకు పూర్తిగా నమ్మకంపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 1,35,000 జాబ్‌కార్డులు ఉండగా.. అందులో ఉపాధి కూలీలు 2,14,776 మంది నమోదయ్యారు. కానీ.. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండడంతో 22 మండలాల్లో ఉపాధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 36,020 మంది మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారు. రైతుల అవసరాలకు ఉపయోగపడే పనులు, సాగునీటి సంరక్షణ పనులపై కలెక్టర్ దృష్టి పెట్టడంతో అలాంటి పనులను మాత్రమే ఎంపిక చేశారు. దీంతో ఉపాధి కూలీలు ఫాంపాండ్, పొలం గట్లు, సోక్‌పిట్లు, ట్రెంచ్ కటింగ్ పనులు చేస్తున్నారు.

### పనుల వద్ద కనీస వసతులు కరువు..

వేసవికాలంలో పనులు అంటేనే ఎవరైనా వెనుకంజ వేస్తారు. ఉపాధి పనుల వద్ద నీడ లేకపోవడంతో ఎండలకు తట్టుకోలేకపోతున్నారు. ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు పంచాయతీ సిబ్బంది టెంట్లు వేయాల్సి ఉండగా ఎక్కడా నీడ సౌకర్యాన్ని కల్పించిన దాఖలాలు కనబడడం లేదు. అటవీ ప్రాంతంలో చేసే ట్రెంచ్ కటింగ్ పనుల వద్ద కూడా నీడ సౌకర్యాన్ని అధికారులు కల్పించడం లేదు. దీంతో కూలీలు ఎండలకు తట్టుకోలేక ముందుగానే ఇంటిముఖం పడుతున్నారు. ఎండలో సైతం పనులు చేస్తున్నప్పటికీ కూలి డబ్బులు సకాలంలో చెల్లించేందుకు అధికారులు కనికరం చూపడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

### వేసవిలో పనులకు బోనస్ రానట్టే..

వేసవికాలంలో ఉపాధిహామీ పనులు చేస్తే గతంలో బోనస్ ఇచ్చేవారు. కానీ.. ఈసారి బోనస్ ముచ్చట లేకపోవడం కాదు.. కనీసం కూలి సొమ్ములు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో కూలీలు హైరానా పడుతున్నారు. మండుటెండలో పనిచేస్తుంటే బోనస్ ఇవ్వకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా కూలీ డబ్బులు రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

### రెండు నెలలుగా పనిచేస్తున్నాం..



మండుటెండలో రెండు నెలలుగా ఉపాధి పనులు చేస్తున్నాం. ఇప్పటివరకు సొమ్ములు మా బ్యాంక్ ఖాతాలో పడలేదు. ఇంట్లో పరిస్థితి బాగాలేదు. పస్తులు ఉండే దుస్థితి వచ్చేసింది. మా ఊర్లో చాలామంది తిండికి ఇబ్బంది పడుతున్నారు. పెద్ద అధికారులు పట్టించుకొని సకాలంలో మా కూలి డబ్బులు మాకు వచ్చే మార్గం చూడాలి.

**– షేక్ బాబు, ఉపాధి హామీ కూలీ, తిప్పనపల్లి, చండ్రుగొండ మండలం**

### వారం రోజుల్లో జమ అవుతాయి..



సాంకేతిక సమస్య వల్ల కూలీల సొమ్ములు వారి ఖాతాల్లో జమ కాలేదు. వారం రోజుల్లో వస్తాయి. డబ్బులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. గతంలో బోనస్ వచ్చేది. ఇప్పుడు ఆ సాఫ్ట్‌వేర్‌లో బోనస్ వచ్చే ఆప్షన్ లేదు. ఇప్పటివరకు కూలీలకు రూ.114 కోట్లు జమ చేశాం. మెటీరియల్‌కు కూడా రూ.73 కోట్లు ఇచ్చాం. వచ్చేనెలలో కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం వ్యవసాయ పనులకు కూలీలు వెళ్లడం వల్ల ఉపాధి పనులకు తగ్గారు. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

**– విద్యాచందన, డీఆర్డీవో, భద్రాద్రి కొత్తగూడెం**

# 27న గులాబీ దండు కదలిరావాలి

- కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి
- రజతోత్సవ సక్సెస్ కోసం రామవరంలో వాల్ రైటింగ్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి గులాబీ దండు కదలిరావాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని రామవరంలో చేస్తున్న వాల్ రైటింగ్‌ను శుక్రవారం వారు పరిశీలించారు. స్వయంగా బ్రెష్ పట్టి రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇచ్చిన వాగ్దానాలు గాలికొదిలి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనపై ఏడాదిన్నరలోనే ప్రజల్లో భ్రమలు తొలగిపోయాయని, బీఆర్ఎస్‌ను దూరం చేసుకొని తాము ఏం కోల్పోయామో ప్రజలంతా గ్రహించారని అన్నారు. ఖాజా బక్ష, మజీద్, పూర్ణ, పెంట్రాజ్, జనిత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలో వాల్ రైటింగ్ చేస్తున్న మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

# తులం బంగారం ఇప్పట్లో సాధ్యం కాదు

- ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకూ ఇబ్బందిగానే ఉంది..
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 18: పేదింటి యువతులకు రూ.1,00,116తోపాటు అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తులం బంగారం ఇప్పట్లో ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతానికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా ప్రభుత్వానికి కొంచెం కష్టంగానే ఉందని, ఇదంతా మీరు చూస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఇక నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాత్రం రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ త్వరలోనే రాబోతుందని, తద్వారా అనేక మందికి ఉన్నత విద్యతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విమానాశ్రయం కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పరిస్థితి డోలాయమానంలో ఉందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఎవరికీ రూపాయి కూడా ఇవ్వొద్దని, అర్హులకు అందేలా కృషి చేస్తానని మాటిచ్చారు. లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ కేఆర్‌వీ ప్రసాద్, కొత్తగూడెం నాయబ్ తహసీల్దార్ అమ్జద్ పాషా, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్‌ఐలు సూర్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

# త్వరితగతిన భూ సమస్యల పరిష్కారం

**పినపాక, కరకగూడెం భూ భారతి అవగాహన సదస్సుల్లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

పినపాక/ కరకగూడెం, ఏప్రిల్ 18: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం–2005 ద్వారా రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మండలంలోని ఈ–బయ్యారం క్రాస్ రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు తమకున్న భూ సమస్యలపై మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలో తహసీల్దార్లు ఆ సమస్యను పరిష్కరిస్తారన్నారు. భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న రైతులను రెవెన్యూ అధికారులు ఏమైనా ఇబ్బందులకు గురిచేసినట్లు తమ దృష్టికి వస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు రైతులు భూ సమస్యలపై అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానం చెప్పారు. అనంతరం భూ భారతి చట్టంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రైతులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం బయ్యారంలో వర్మ అనే రైతు సాగు చేస్తున్న మునగ పంటను కలెక్టర్ పరిశీలించారు. ఆర్డీవో దామోదర్, ఏడీఏ తాతారావు, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో సునీల్‌శర్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్


గిరిజన నాయకుల సమస్యలు వింటున్న కలెక్టర్

### అప్పీలుకు అవకాశం: కలెక్టర్

కరకగూడెం మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భూ భారతి నూతన చట్టం అవగాహన కార్యక్రమంలోనూ కలెక్టర్ మాట్లాడారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూభారతి చట్టం ద్వారా రైతులు అప్పీలు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఆర్డీవో దామోదర్, తహసీల్దార్ నాగప్రసాద్, ఎంపీడీవో దేవరకుమార్ పాల్గొన్నారు.

# యేసయ్యా.. మీ త్యాగం అజరామరం..

- 'గుడ్‌ఫ్రైడే' ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవ బోధకులు
- జిల్లాలో భక్తిశ్రద్ధలతో 'శుభశుక్రవారం'

'యేసయ్యా.. మీ త్యాగం అజరామరం.. మీ మార్గం అనుసరణీయం..' అంటూ క్రైస్తవ బోధకులు క్రీస్తు త్యాగాలను విశ్వాసులకు బోధించారు. మనుషులు చేసిన పాపాలకు బలిగా తన ప్రాణాన్ని అర్పించి సిలువపై మరణం పొందిన రోజుగా క్రైస్తవ భక్తులు జరుపుకునే గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రార్థనా మందిరాల్లోనూ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తుకు మరణశిక్ష విధించే క్రమంలో శిలువ మార్గపు సన్నివేశాలను ప్రదర్శించారు. క్రైస్తవ భక్తులు వాటిని చూసి కంటతడి పెడుతూ ప్రార్థనలు చేశారు. అలాగే, గత 40 రోజులుగా కొనసాగించిన ఉపవాస దీక్షలను శుక్రవారం విరమించారు. చర్చిలకు తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనలు ఆచరించారు. ఈ సందర్భంగా క్రైస్తవ బోధకులు బైబిల్ వాక్యాలను ఉపదేశించారు. గుడ్‌ఫ్రైడే అనేది.. దేవుడికి మానవుడికి.. అలాగే, మానవుడికి మానవుడికి మధ్యగల ప్రేమ బంధాన్ని చాటుతుందని బోధించారు. మానవులందరూ పాపాలను దరిచేరనీయకూడదని, ప్రేమతో జీవించాలని, దేవుడి మార్గాన్ని అనుసరించాలని ఉపదేశించారు. –నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 18


పాల్వంచ: సిలువమార్గ సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

# అది చట్ట సవరణ కాదు.. ముస్లింలపై కక్షసాధింపు

- 'వక్ఫ్' చట్టాన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లిం సంఘాల నిరసనలు


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇసున్న ముస్లిం నేతలు

కేంద్ర ప్రభుత్వం తెచ్చింది వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లు కాదని.. అది ముస్లింలపై కక్షసాధింపు బిల్లని వివిధ ముస్లిం సంఘాల నేతలు, మత పెద్దలు విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై కక్షసాధింపు చర్యతో లౌకిక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఇలాంటి మతోన్మాద చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ముస్లిం సంఘాల నాయకులు, మత పెద్దలు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు. భద్రాద్రి జిల్లా రామవరంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కూసుమంచిలో మానవహారం చేపట్టారు. ఖమ్మంలో ప్రదర్శన చేపట్టి 'రాజ్యాంగాన్ని పరిరక్షిద్దామని, వక్ఫ్‌చట్టాన్ని తిరస్కరిద్దామని నినాదాలు చేశారు. సవరించిన వక్ఫ్‌చట్టాన్ని రద్దుచేయాలంటూ భద్రాచలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీపీఎం నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. నూతన వక్ఫ్ చట్టం రద్దయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

–రామవరం/ భద్రాచలం/ ఖమ్మం, ఏప్రిల్ 18

# మినరలేమీ కాదు.. జనరలే!


కరకగూడెంలోని ఆర్‌వో ప్లాంట్

**ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించిన కొందరు వ్యాపారులు మినరల్ వాటర్ పేరిట జనరల్ వాటర్‌ను అమ్ముతూ ఘరానా మోసానికి పాల్పడుతున్నారు. వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. ఒకవైపు ప్రజలకు శుద్ధ జలం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా సురక్షిత మంచినీరు అందకపోవడంతో ఇదే అదునుగా మినరల్ వాటర్ పేరిట ప్రజలను మోసం చేస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.** –కరకగూడెం, ఏప్రిల్ 18

- వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు శూన్యం
- మినరల్ పేరుతో బోరు నీరే యథేచ్ఛగా విక్రయం
- 'మిషన్ భగీరథ' నీటిపై దుష్ప్రచారం చేసి వ్యాపారం
- నివాసాల మధ్యలో బోర్లతో లోతుల్లోకి భూగర్భ జలం


ట్రాలీపై ట్యాంకులో తరలుతున్న నీరు

### నిబంధనలిలా..

- భారతీయ ప్రమాణాలు (ఐఎస్ఐ) అనుమతి పొందిన పత్రాన్ని ప్రదర్శనగా ఉంచాలి.
- పరిశ్రమల శాఖ నుంచి అనుమతిపత్రం ఉండాలి.
- ప్లాంటులో మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్‌తో పాటు ఇద్దరు టెక్నీషియన్లు ఉండాలి.
- ప్రతిరోజూ నీటి పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేయాలి.
- పరీక్షల రికార్డులను నెలకొకసారి అధికారులకు చూపించాలి.

గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటికీ శుద్ధ జలాలు అందించాలనే సంకల్పంతో మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని సరిగ్గా అమలు చేయడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా.. మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ఓ కొత్త బాగోతానికి తెరలేపారు.. భగీరథ వాటర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రపరచడం లేదని, వాటర్ పైపుల ద్వారా వస్తూ లీకేజీ అయ్యి కలుషితమవుతున్నాయని, సరిపడా తాగునీరు రాదని చెప్పి వారి వ్యాపారం పెంచుకునేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించడానికి మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్ నిర్వహణకు ల్యాబ్ టెక్నీషియన్ అవసరం ఉంటుంది. కానీ, ఎక్కడా ల్యాబ్ టెక్నీషియను కనిపించరు. బోరు నీటిని పంప్ చేసి రుచి కోసం కొంత కెమికల్ పౌడర్ కలిపి ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు.

### పడిపోతున్న భూగర్భ జలాలు..

మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు అనేక నిబంధనలు, అనుమతులు అవసరం. అయితే అవేమీ పట్టనట్లుగా గ్రామాల్లో ఇండ్ల మధ్యనే వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి రేయింబవళ్లు నీటిని తోడుతుండటంతో చుట్టుపక్కల ఇండ్లలోని, బోర్లు, బావులు ఇంకిపోతున్నాయి. తద్వారా పూర్తిగా భూగర్భజలాలు పడిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వాటర్ ప్లాంట్లు ఎక్కడపడితే అక్కడ వెలుస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్లాంట్లు నిర్వహించాలంటే ఐఎస్ఐ గుర్తింపు తప్పనిసరి. కానీ.. అలాంటి గుర్తింపు ఉన్న ప్లాంట్లు జిల్లాలో ఒక్కటీ లేకపోవడం గమనార్హం. కరకగూడెం మండలంలో నాలుగు అనధికారిక ప్లాంట్లు వెలిశాయి. ఈ నీటిలో పలు రసాయనాలు, స్వీట్‌నర్లు వాడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్లాంట్ల నుంచి మండలంలో అన్ని గ్రామాలకు తిరుగుతూ 20 లీటర్ల క్యానుకు రూ.15 నుంచి రూ.25 వరకూ కూలింగ్ వాటర్ క్యాన్‌కు రూ.40 నుంచి రూ.50 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటి వాటర్ తాగితే అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ప్రజల ప్రాణాలతో చెలగాటం..



మినరల్ వాటర్ పేరిట మోసం చేస్తూ వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాలం ఆడుతున్నారు. మిషన్ భగీరథ నీటిపై చెడ్డ ప్రచారం చేస్తూ కెమికల్ కలిపిన వాటర్‌ను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇండ్ల మధ్యలో ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. అధికారులు తనిఖీలు చేసి అనధికార ప్లాంట్లను సీజ్ చేయాలి. **–బిజ్జా రామనాథం, కరకగూడెం**

### చర్యలు తీసుకుంటాం..



అనధికార ప్లాంట్లను నిర్వహించడం చట్టవిరుద్ధం. అలాంటి వారిని వదలం. నిర్వాహకులపై కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అన్ని అనుమతులతోనే ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అనధికార వాటర్ ప్లాంట్లతో ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది.

**–నాగప్రసాద్, తహసీల్దార్**


ట్రాలీపై తెచ్చిన ట్యాంకు నీటిని గ్రామాల్లో క్యాన్లలో పడుతున్న నిర్వాహకులు